# సత్యవాక్కు

# The Word of Truth



# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
# సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p. m. |
| బుధవారము | 9-30 to 9-45 a. m. |

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము | 9-00 to 9-15 p. m. |
| ఆదివారము | — 1-30 to 1-45 p. m. |

**తమిళం — SATYA VAZHI**

| | |
|---|---|
| మంగళవారము | — 5-30 to 5-45 p. m. |
| గురువారము<br>శుక్రవారము | 6-45 to 7-00 p. m. |

**మలయాళం — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| మంగళవారము<br>శుక్రవారము | 3-45 to 4-00 p. m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి:

**S A T Y A V A N I**
P.O. Box. 80
K A K I N A D A – 533 001

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. పి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **12** జూలై **1984** సంపుటి **4**


# సంపాదకీయము

## వీరు ఎటువంటి క్రైస్తవులు ?

## *( What Kind of Christians are These ? )*

'క్రైస్తవుడు' అనే పదాన్ని ఈ లోకం చాల చులకనగా వాడేస్తుంది. క్రీస్తునందు ఏమాత్రం నమ్మిక కలిగిన వాడైనా క్రైస్తవుడేయని చెప్పబడుచున్నది. దీనిలో కేథలిక్కులు, ప్రొటెస్టాంటులు, అన్నిరకాల మతశాఖలవారు యిమడ్చబడతారు. దేనికీ చెందకుండా స్వతంత్రులము అని చెప్పుకొనేవారు కూడా దీనిలో వస్తారు.

బైబిలు చెప్పురీతిగా దేవునికి లోబడి నిజంగా క్రైస్తవులైన వారున్నారు. అయితే క్రైస్తవుడగుట వేరు, క్రైస్తవునిగా యుండుట వేరు. ఉదాహరణకు: ఒకడు సంఘారాధనలకు ఎన్నింటికి హాజరు కావాలి? ఎంతకాలానికి హాజరవ్వాలి? కానుకగా ఎంత యివ్వాలి? సంఘకృషిలో ఒకడు ఎంతమట్టుకు పాల్గొనాలి?

ఆరాధనకు అప్పుడప్పుడు మాత్రమే హాజరయ్యేవాడు క్రైస్తవుడనని ఎట్లు చెప్పుకోగలడు? కొద్దిగా మాత్రమే యిస్తూ ఏదో కొంత

యిచ్చానని చెప్పుకొనువాని సంగతి యేమిటి? అంతేకాదు, బైబిలు పఠనానికి కొందరు రానేరారు, తమ పిల్లలను సండే స్కూలుకు పంపరు, సువార్త కూటాల్లో సహాయపడరు. మరికొందరు రోగులను దర్శించరు, మరెవరినీ క్రీస్తువైపు మార్చడానికి ప్రయత్నించరు. కపట స్వభావం కలిగినవారు, బూతులాడేవారు, పొగత్రాగేవారు, మద్య పానాసక్తులు, దురలవాట్లకు లోనైనవారు కొందరున్నారు. అయినను ఈ ప్రజలు మేమూ క్రైస్తవులమే యని చెప్పుకొంటారు. ఈ రకమైన ప్రజలు ఎటువంటి క్రైస్తవులు? బైబిలు చెప్పు రీతిగా వారు క్రైస్తవులు కానేకారు.

సంఘములో కొంతమంది ఎల్లప్పుడు దుర్మార్గతనే సపోర్టుచేసే వాళ్లుండడం నీవెన్నడైనా గమనించావా? ఏసంగతిమైనా సరే, భక్తిగల నమ్మకమైన క్రైస్తవులు సత్యానికి నిలబడి అసత్యాన్ని దుర్మార్గతను ఎదిరించేటప్పుడు వారిని వ్యతిరేకిస్తూ భిన్నముగా నిల బడేవారుంటారు. వారు సణుగువారు, ఎప్పుడూ అసంతృప్తితో యుండే వారు, దేనికీ సంతోషించరు. ప్రసంగాలు వారికి నచ్చవు. సంఘ కార్యక్రమాలలో వారికి తగినంత పాత్ర ఇయ్యబడడం లేదని వారు గొడవచేస్తారు. తప్పులు పట్టుకోడానికి, విమర్శించడానికి, సభ్యులను రెచ్చగొట్టడానికి వారెల్లప్పుడు సంసిద్ధులు. వీరు ఎటువంటి క్రైస్తవులు? వారు బైబిలు యేమి చెప్పుచున్నదో ఎరుగనివారు. వారు సంఘారాధనలకు హాజరు కావలసినరీతిగా హాజరుకారు, వారి కానుకలద్వారా సంఘాన్ని సపోర్టుచేయరు. వారు బలహీనులు. అపవాది వారిని ఈడ్చుకొని పోవడం సులభం.

నీవు ఎటువంటి క్రైస్తవుడవు? నీవు పేరుమట్టుకే క్రైస్తవుడవా? ఒక్కొక్కసారి ఈ రకమైనవారు మేము బలమైన క్రైస్తవులం అని తలుస్తారు. వారు బలహీనులనే సంగతిని అసహ్యించుకొంటారు. కాని వారి జీవితాలను ఒక్కసారి చూడండి. వారి ఆత్మీయస్థితిని ఒక్క-

సారి గమనించండి. "వారి ఫలములవలన మీరు వారిని తెలిసికొందురు" అని యేసుప్రభువు చెప్పాడు (మత్తయి 7:16). ఇంకోమాటలో, వారు జీవించే విధానాన్ని బట్టి వారేమై యున్నారో మనం చెప్పగలం.

శిష్యులు అంతియొకయలో మొట్టమొదట క్రైస్తవులని పిలువబడినట్లు లేఖనములు చెప్పుచున్నందున పేరులో క్రైస్తవుడై యుండుట ముఖ్యము (అపొ. కా. 11:26). పౌలు అగ్రిప్పరాజుకు సువార్త ప్రకటించినప్పుడు "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే" యని అతడు పలికాడు (అపొ. కా. 26 : 28). పేతురు ఇట్లు చెప్పాడు: "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:16). శిష్యులకు పెట్టబడిన శ్రేష్టమైన నామమును దూషించువారు కొందరున్నారని యాకోబు చెప్పాడు (యాకోబు 2:7). ఆ నామము ఏమిటో తెలుసా? ఎఫెసులో యున్న క్రైస్తవుల నుద్దేశించి, "నీవు సహనముకలిగి నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదని నేనెరుగుదును" అని క్రీస్తు చెప్పాడు (ప్రక 2:3). పెర్గములోయున్న క్రైస్తవులు ఆయన నామమును గట్టిగా చేపట్టారని ఆయన చెప్పాడు (ప్రక 2:13). అపొ.కా. 4:12 లో క్రీస్తు నామములోనే రక్షణ యున్నదని మనకు చెప్పబడింది. మరల "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" యేసు ప్రభువు చెప్పాడు (మత్తయి 18:20). ఇప్పుడొక ప్రశ్న: ఎవడైనా ఒక వ్యక్తిగాని, గుంపుగాని, లేక సంఘముగాని క్రీస్తు నామాన్ని ధరించక, ఆయనను గౌరవించకపోతే వారితో క్రీస్తు ఉంటాడని మనం ఎట్లు అనుకోగలం? ఇంకో ప్రశ్న: మానవుల నామాలను ధరిస్తూ అందును బట్టి క్రీస్తు సంతోషిస్తాడని మనం ఎట్లు అనుకోగలం? అందువలన మనం క్రీస్తు నామమును ధరించుట అత్యవసరమని గ్రహించాలి.

ఒకడు క్రీస్తు నామాన్ని ధరించడం మాత్రమే కాకుండా తన జీవితాన్ని బట్టి అతడు క్రైస్తవుడని నిరూపించాలి. నేను క్రైస్తవుడనని ఎవడైనా చెప్పుకోవచ్చును గాని మాటలకంటె క్రియలే ఎక్కువ వినబడ్తాయి. అనేకులు లేఖనాలను చదువరు గాని మన జీవితాలను చదువుతారు. అందువలన మనం క్రీస్తుకు లోబడుచూ యున్నామా? ఆయనను వెంబడించుచున్నామా? క్రీస్తు మన జీవితాల్లో కనబడుచున్నాడా? ఆయనకు నమ్మకముగా యున్నామా? ఏదో కొంత చేసి క్రైస్తవునిగా ఎట్లుండగలనా యని అనుకొనుటకంటే, నేను క్రీస్తు కొరకు ఎంత ఎక్కువ చేయగలను అనే కోరిక మనకు ఉండాలి.

నా మిత్రుడా, నీవు క్రైస్తవునిగా యుండాలి. లేఖనాల్లో మనకు కనబడే క్రైస్తవునిగా నీవుండాలి. అంటే నీవు ప్రభువుకు లోబడి నీ మాటలలోను చేతలలోను కూడ మహిమ పర్చునట్లు, ఘన పర్చునట్లు ఆయన నామాన్ని నీవు ధరించాలి. పౌలు ఇట్లు చెప్పాడు: "మరియు మాటచేత గాని క్రియచేత గాని, మీరేమిచేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17). కొందరు క్రీస్తు నామాన్ని ధరిస్తారు గాని క్రీస్తుకొరకు జీవించరు. మరికొందరు క్రీస్తువలె జీవించ ప్రయత్నిస్తారు గాని ఆయన నామమును ధరించరు. ఈ రెండు సందర్భములలోను కొంత కొరత యున్నది. మనం నామములోను, జీవించే విధానంలోను క్రైస్తవులుగా యుండాలని ప్రభువు కోరుచున్నాడు. అప్పుడు మనం వేషధారులము కాము గాని లేఖనములు చెప్పుచున్నట్లును, మన ప్రభువు కోరుచున్నట్లును నిజమైన క్రైస్తవులం.

---

విశ్వాస వీరులు-6

## యాకోబు (Jacob)

"విశ్వాసమునుబట్టి యాకోబు అవసానకాలమందు యోసేపు

కుమారులలో ఒక్కొక్కని ఆశీర్వదించి తన చేతికర్ర మొదలుమీద ఆనుకొని దేవునికి నమస్కారము చేసెను" (హెబ్రీ 11:21).

ఈ గొప్ప పితరుడైన యాకోబును గూర్చి ఆలోచించునప్పుడు అనేక సంగతులు మనకు జ్ఞాపకం వస్తాయి. తన సోదరుడైన ఏశావు జ్యేష్ఠత్వమును దొంగిలించడం, దేవునిదూతతో పోరాడడం, అతనికి కలిగిన నిచ్చెన దర్శనం, అతని ఇద్దరు భార్యలు, అనేకమంది పిల్లలు వగయిరాలనేకం మన మనస్సులోనికి వస్తాయి. అయితే హెబ్రీ పత్రిక లేఖకుడు వీటిలో దేనినీ ఎంచుకోలేదు గాని యాకోబు మరణ కాలములో జరిగిన రెండు సంగతులను మనకు ఎత్తి చూపించాడు.

హెబ్రీ 11:21లో ఒక్క సంఘటనే చెప్పబడిందని మొదట మనం అనుకోవచ్చును గాని, నిజానికి అందులో రెండు సంఘటనలున్నాయి. యాకోబు తన చేతికర్ర మొదలుమీద ఆనుకొనినప్పుడు జరిగిన సంగతి ఒకటి. యోసేపు కుమారులను ఒక్కొక్కని ఆశీర్వదించుట మరియొకటి. ఈ వ్యాసంలో ఈ రెండు సంఘటనలను మనం గమనిద్దాం. యాకోబు విశ్వాసం దేనిపై ఆధారపడెను? అనే ప్రశ్నకు జవాబునిద్దాం.

ఈ రెండు సంఘటనలు అవి జరిగిన క్రమములో పెట్టడానికి మనం ఆదికాండము 47, 48 అధ్యాయముల నొకసారి చూడాలి. 47వ అధ్యాయం, 29వ వచనంలో ఇశ్రాయేలు (యాకోబు) చావవలసిన దినములు సమీపించినప్పుడు తన కుమారుడైన యోసేపును పిలిపించాడని చూడగలం. అతడు యోసేపుతో ఇట్లన్నాడు: "నన్ను ఐగుప్తులో పాతిపెట్టకుము. నా పితరులతో కూడ నేను పండుకొనునట్లు ఐగుప్తులోనుండి నన్ను తీసికొనిపోయి వారి సమాధిలో నన్ను పాతిపెట్టుము" (47:30). అందుకతడు నీ మాటచొప్పున చేసెదనని ప్రమాణము చేసాడు. అప్పుడు ఇశ్రాయేలు తన మంచపు తలమీద వంగి దేవునికి నమస్కారము చేసెను (47:31).

తనకును తన వంశస్థులకును దేవుడు వాగ్దానముచేసిన దేశము ఐగుప్తు కాదని యాకోబు ఎరుగును. వాగ్దానము చేయబడిన దేశాన్ని వారొకానొకప్పుడు పొందుతారనే విశ్వాసాన్ని అతడు కలిగియున్నాడు. అందువలన అక్కడికి కొనిపోబడాలని అతడు ఆశించాడు. యాకోబుయొక్క కోరికలు నెరవేర్చబడినట్లు ఆదికాండము 50:12, 13లో మనం చూడగలం.

యోసేపు కుమారులైన మనష్షే, ఎఫ్రాయిములను ఆశీర్వదించడం రెండవ సంఘటన. యాకోబు వారిద్దరికీ తన పేరు పెట్టాడు. వారిని భూమిమీద విస్తరింపజేయాలని దేవుని కోరాడు. చిన్నవాడు పెద్దవానికంటె గొప్పవాడౌతాడనికూడ అతడు చెప్పాడు (ఆది 48). యిది పారంపర్యానికి భిన్నముగాయున్నను, పరిశుద్ధాత్మని నడిపింపుచొప్పున పలుకుచు యాకోబు తన మాటలు నెరవేరునని ఎరుగును. అవి నెరవేరినట్లు సంఖ్యాకాండము 1:33, 35; 2:19, 21 మరియు ద్వితీయోపదేశకాండము 33:17ను చదువుటలో మనం గమనించగలము.

రాబోవు ఈ సంఘటననుగూర్చి యాకోబు అట్టి విశ్వాసం ఎలా కలిగియున్నాడు? అతని విశ్వాసం దేనిపై ఆధారపడియున్నది? దీనికి ఆది 48:15, 16లో అతడే జవాబిచ్చాడు. అతని జీవితకాలమంతయు దేవుడే అతని కాపరియని, పోషకుడని ఆయన దూత సమస్త కీడులనుండి తప్పించెనని అతడు చెప్పాడు. ఇంకో మాటలో దేవుడు తన వాగ్దానములను నెరవేర్చువాడని యాకోబుకు రుజువుపరచబడింది. ఆయన చిత్తానికి లోబడువారిని ఆయన సంరక్షిస్తాడని అతనికి దృఢపరచబడింది.

యాకోబు ఉదాహరణనుబట్టి దేవునియందు ఆయన వాక్యమునందు ఎక్కువ విశ్వాసం కలిగియుండడం మనం నేర్చుకోవాలి. "కొందరు ఆలస్యమని యెంచుకొనుచున్నట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యముచేయువాడు కాడు గాని ఎవడును నశింపవలెనని

యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2 పేతురు 3:9).

—డేవిడ్ జాన్సన్.

సంక్షిప్త ప్రసంగము :

## " ధర్మ శాస్త్ర గ్రంథము నాకు దొరికెను "

## *( I have Found The Book )*

2 రాజులు 22:8.

పరిచయము :

యూదాను యోషియా యేల నారంభించి నప్పుడు ఎనిమి దేండ్ల వాడు. గత 57 సంవత్సరములలోను దుష్టులైన రాజులు యూదాను పాలించారు. వారి నిర్లక్ష్యంవలన యెహోవా మందిరము శిథిలమై పోయింది. దాన్ని బాగుచేయుట అత్యవసరం. యోషియా మంచి రాజగుటచే శిథిలమైన దాన్ని బాగుచేయ నాజ్ఞాపించాడు. ఆ స్థలాన్ని బాగుచేయుచున్న సందర్భంలో ప్రధాన యాజకుడైన హిల్కీయా - "యెహోవా మందిరమందు ధర్మశాస్త్ర గ్రంథము నాకు దొరికెనని షాఫాను అను శాస్త్రితో చెప్పెను". ధర్మశాస్త్ర గ్రంథము పడిపోయెను, గాని ఇప్పుడు అది దొరికింది. ఆ గ్రంథము దొరికిన తరువాత యోషీయా యొక్క మనస్తత్వ మెట్లుండెను ?

I అతడు దాన్ని చదివాడు (2 రాజులు 22 : 8, 10) :

1. వారి పితరులు విశ్వాసభ్రష్టులై విగ్రహారాధనకు తమ్మును అప్పగించుకొన్నారు.
2. దేవుని వాక్యం వారి దగ్గరనుండి కనబడకుండ పోవునంతమట్టుకు వారు దాన్ని నిర్లక్ష్యం చేసారు.
3. అందువలన యోషియా తరమువారు ఆ గ్రంథమును కనుగొని దాన్ని చదివేవరకు సరియైన విశ్వాసము నెరిగి దేవుని కిష్టులుగా యుండలేక పోయారు.

4. నేడుకూడ మనం దేవుని వాక్యాన్ని నిర్లక్ష్యం చేస్తే, సరియైన విశ్వాసం కలిగి యుండలేము, దేవుని కిష్టులుగా యుండలేము (రోమా 10:17; మత్త 4:4; 2 తిమో 3:15-17; హెబ్రీ 11:6).

## II అతడు వాక్యము నంగీకరించి మారుమనస్సు నొందాడు (22 : 11-13) :

1. కొందరు దేవుని వాక్యాన్ని విన్నప్పుడు తమ హృదయాన్ని కఠినపరచు కొంటారు (అపొ. కా. 4:2; 7:54).
2. గ్రంథము యొక్క ప్రాముఖ్యతను, దానిలోని వర్తమానాన్ని యోషీయా గుర్తించాడు.
3. మారుమనస్సు నొందిన రాజు హృదయము "యెహోవా మార్గములయందు నడచి, ఆయన ఆజ్ఞలను కట్టడలను శాసనములను పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మతోను గైకొనుటకు" పాపమునుండి మరలింది (23:3).
4. క్రొత్త నిబంధనలో పెంతెకొస్తు దినమున వేలకొలది ప్రజలు ఇదే రకమైన మనస్తత్వమును కనుబరచుట మనం చూడగలము (అపొ. కా. 2:37, 38).

## III దాన్ని ఇతరులకు బోధించాలని అతడు గుర్తించాడు (23 : 1-3).

1. దేవుని వాక్యం యొక్క ప్రాముఖ్యతను అతడు గుర్తించగానే, దాన్ని అతడు యితరులకు బోధింప సాగాడు.
2. దాన్ని అతని కిష్టమైన వారికేగాక, అందరికీ కొద్దివారేమి గొప్పవారేమి అందరికీ అతడు బోధించాడు.
3. క్రీస్తు సువార్త అందరికీ కావాలని మనం గమనించాలి (మత్త 28:18-20; 1 తిమో 2:4).

IV అబద్ధ మార్గము లన్నింటినీ అతడు విసర్జించాడు (23:4-24).

1. విగ్రహారాధకులను, అవినీతిని అతడు సహించలేదు. కీర్తనల గ్రంథకర్తతో అతడు ఏకీభవించాడు (కీర్తన 119:104).
2. విగ్రహాలన్నిటినీ అతడు నాశనం చేసాడు. నిజదేవుని ఆరాధనను యూదాలో పునఃప్రతిష్టించాడు.
3. తప్పుమార్గము లన్నింటినీ మనం అసహ్యించుకోవాలి. సువార్తను గూర్చి సిగ్గుపడనక్కర్లేదు (రోమా 1:16; యూదా :3).

V. దేవుని కోపమునుండి అతడు రక్షింపబడ్డాడు (22:16-20):

1. దేవుని కోపము నుండి యోషీయా రక్షింపబడెను ఏలయనగా:
   a) అతడు మెత్తని మనస్సు గలవాడు.
   b) యెహోవా సన్నిధిని దీనత్వము వహించాడు.
2. రక్షింపబడాలంటే యిటువంటి మనస్తత్వం మనకు సహాయపడగలదు.
3. ప్రభువు సన్నిధిలో మనం తగ్గించుకోవాలి, ఆయన వాక్యానికి మన హృదయాలను తెరవాలి (అపొ. కా. 2:37-41; 16:30-34; 22:10-16).

ము గిం పు :

1. యోషీయా మనస్తత్వము మంచిది, సరియైనది (2 రాజులు 23 : 25).
2. నీవు దేవుని వాక్యాన్ని చదివి, అంగీకరించి, నీ పాపములను గూర్చి మారుమనస్సు పొంది, ఆయనకు లోబడుదువా? నీవు యితరులకు బోధించాలని గుర్తురుగుదువా? తప్పుమార్గాలన్నీ విసర్జింతువా? దేవుని కోపము నుండి తప్పించుకోవాలంటే, నీవు ఇవన్నీ చేయాల్సిందే.
3. నీ యింటిలో ధర్మశాస్త్ర గ్రంథము ఉన్నదా? పడిపోయిందా?

# కృపద్వారా రక్షింపబడే దెక్కడ?

*(Saved by Grace Where?)*

దేనినయినా పొందుటకు అర్హులము కాకపోయినను, దాన్ని గూర్చి కనికరింపబడుట కృపయని బైబిలు విశ్వాసులు అంగీకరిస్తారు. మానవుడు తనకుగా తాను యేమి చేసికొనలేడో దాన్ని దేవుడు చేసాడు. దేవుని కృపను గూర్చిన కథ అంతా అదే. కృప ఒక మార్గమని లేక స్థానం అని బైబిలు బోధించుచున్నట్లు ఇప్పుడు గమనిద్దాం.

## క్రైస్తవులు కృపలో నిలిచియుంటారు

రక్షింపబడిన వారు కృపలో నిలిచి యున్నట్లు చెప్పబడింది. రోమాలో యున్న క్రైస్తవులకు అపొ. పౌలు వ్రాస్తూ, "ఆయన ద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గల వారమై అందులో నిలిచి యుండి దేవుని మహిమను గూర్చిన నిరీక్షణను బట్టి అతిశయపడు చున్నాము" అని చెప్పాడు (రోమా 5:2). సువార్త ప్రకటించుట ద్వారా పాపులు క్రీస్తు కృపలోనికి పిలువబడుదురు (గలతీ 1:6; 2 థెస్స 2:14).

## కృపలో యుండుటనగా క్రీస్తులో యుండుటే

ఆయన కృపద్వారా కలుగు విమోచన క్రీస్తు యేసునందున్నది (రోమా 3:24). విశ్వాసులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుదురు (గలతీ 3:27). కాబట్టి ఆయన కృపద్వారా ఉచితముగా నీతిమంతుడని తీర్చబడు నిమిత్తము మానవుడు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:33).

## క్రీస్తులో యుండుటనగా ఆయన సంఘములో యుండుటే

క్రీస్తు శరీరములో యుండుటనగా ఆయన సంఘములో యుండుటయే(కొలస్స 1:18). కృపలో యుండుట, కృపలో నిలిచియుండుట,

క్రీస్తులో యుండుట, మన ప్రభువు సంఘములో యుండుట—ఇవన్నీ ఒక్కటే యని మనం గ్రహించామను కొనుచున్నాను.

ఒకడు కృపద్వారా రక్షింపబడేదెక్కడ? బైబిలు ఇట్లు జవాబిచ్చు చున్నది. క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘములో ఒకడు రక్షింపబడ్తాడు (అపొ.కా. 20:28). సమస్త ఆత్మీయాశీర్వాదములు 'క్రీస్తులో' యున్నవి. అనగా ఆయన శరీరమైన సంఘములో యున్నవి (ఎఫెసీ 1:3).

—జీన్ ఓవర్టన్.

---

## రక్షణ పధకము
## *(The Plan of Salvation)*

సువార్త రక్షణ పధకము సూక్ష్మమైనది. పాపులు సువార్త విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని, బాప్తిస్మము పొందాలి (అపొ. కా. 18:8; 2:38). ఈ పధకాన్ని గూర్చిన గ్రంధం (అధ్యాయాలు వచనాలతో) మన కున్నది. మానవు లేర్పరచిన విభిన్న పధకాలకు బైబిలు చేయూత నియ్యడం లేదు. ఉదాహరణకు, ప్రార్థించుటద్వారా నాకు రక్షణ కలిగిందని యెవడైనా చెప్పవచ్చు. అయితే దాన్ని గూర్చి మనం బైబిలులో ఎక్కడా చదువలేము. బైబిలు పరలోకానికి నడిపించే ఒక పటము. ఆ పటములో ఇయ్యబడిన సూచనలను మనం పాటించాలి. లేకపోతే మనం త్రోవతప్పి పరలోకం చేరలేము. అందుకే 'మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు జాగ్రత్త పడుడి' యని బైబిలు చెప్పుచున్నది (2 పేతురు 1:10).

కొన్నిసార్లు రేడియో కార్యక్రమాలద్వారా మంచి ప్రసంగములను మనం వింటాము. యివి క్రైస్తవ జీవనాన్ని గూర్చి, నైతిక సూత్రాలను గూర్చి ఉంటాయి. అయితే క్రైస్తవులగుట యెట్లో అను సమాచారాన్ని మాత్రం అవి అందియ్యవు. కొందరు బోధకులు క్రీస్తు

నందు విశ్వాసముంచండి అని మాత్రం చెబుతారు. రక్షింపబడాలంటే విశ్వాసముంచితే మాత్రం సరిపోతుందని వారు చెబుతారు. వారు చెప్పేది యాకోబు 2 కు, హెబ్రీ 11 కు కేవలం విరుద్ధమైనది. నిజానికి విశ్వాస మొక్కటి మాత్రమే చాలుననే సిద్ధాంతం కేవలం మానవుడు సంకల్పించింది.

సువార్త రక్షణ పథకము సూక్ష్మమైనది, విపులంగా యున్నది. అందరు దానికి లోబడాలని మేము విజ్ఞాపన చేయుచున్నాము. దేవుని సంకల్పాన్ని నిరాకరించవద్దు (లూకా 7:30). బాప్తిస్మం పొందిన తరువాత, మరణ పర్యంతము నమ్మకముగా యుండు (ప్రకటన 2:10). పైనున్న క్రీస్తుమీదనేగాని భూసంబంధమైన వాటిమీద నీ మనస్సు పెట్టుకోవద్దు (కొలస్స 3:1, 2).

—రిచర్డ్ బోనర్.

---

## అతి కఠినమైన ఆజ్ఞ
### (*The Hardest Command*)

పరలోకం నుండి వచ్చిన అత్యంత కఠినమైన ఆజ్ఞ ఏది? బాప్తిస్మమా? ప్రభు రాత్రిభోజనమా? నమ్మకమైన క్రైస్తవ జీవితం జీవించడమా? ఈ ఒక్కొక్క దానికి కాదు అని మనం జవాబీయవలసి వస్తాది. నిస్సందేహంగా దేవుని వాక్యంలో యున్న అతి కఠినమైన ఆజ్ఞ- -మారుమనస్సు. లూకా 13 : 3 లో అది సూక్ష్మంగా ఇట్లు చెప్ప బడింది: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు."

ఈ యాజ్ఞ ఒకని అహంను ఉద్దేశించి చెప్పబడింది గనుక యిది కష్టమైనదిగా కనబడతాది. మన శరీరాలను మనం లొంగదీసికోవాలి. ఈ శరీరాన్ని దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేయాలి. అయితే వీటిని చేయడానికి మానవజాతిలో పెక్కుమంది మాత్రం

యిష్టపడుటలేదు. అవును, మనం అసాధ్యమైన అనేక సంగతులను చేసాం; వివిధ గ్రహాలమధ్య నున్న దూరాన్ని కనుగొన్నాం, చంద్రమండలంపైకి వెళ్లి తిరిగి రాగలిగే యంత్రాన్ని కనుగొన్నాం గాని ఈ యాజ్ఞను మాత్రం పాటించలేకపోయాం.

ఈ యాజ్ఞలో యున్న కష్టం బైబిలునందలి ఉదాహరణలలో కూడా మనకు కనబడుచున్నది. నోవహు నీతిని బోధించాడుగాని తన కాలమునాటి దుష్టలోకం మారుమనస్సు నొందునట్లు చేయలేకపోయాడు. హేరోదుకును హేరోదియకును మారుమనస్సు గూర్చి బోధించుటవలన బాప్తిస్మమిచ్చు యోహాను శిరచ్ఛేదనము చేయబడ్డాడు. యేసు తన కాలమునాటి కొన్ని పట్టణాలు మారుమనస్సు పొందునట్లు చేయలేకపోయాడు. ఫేలిక్సు మారుమనస్సు పొందునట్లు పౌలు చేయలేకపోయాడు. అవును, పాటించడానికి నిజంగా మారుమనస్సు ఒక కఠినమైన ఆజ్ఞే.

అది కష్టతరమైన దయినాసరే, మానవులు పాపం చేసినప్పుడు మారుమనస్సు పొందాలని అన్నికాలాల్లోను దేవుడు ఆజ్ఞాపించాడు. హనోకు మారుమనస్సును ప్రకటించాడు. నోవహు మారుమనస్సు ప్రకటించిన దేవుని వక్త. ప్రవక్తలు మారుమనస్సును ప్రకటించారు. ఇప్పుడు పాపులందరు మారుమనస్సు పొందాలని దేవుడు ఆదేశించుచున్నాడు (అపొ. కా. 17:30; 2 పేతురు 3:9). నీవు అపనమ్మకముగా యున్న దేవుని బిడ్డవైతే, తప్పక మారుమనస్సు పొందాలి (అపొ. కా. 8 : 22). ఒక్కొక్కసారి సంఘమంతా మోకాళ్ళపై బడి మారుమనస్సు పొందాల్సిన అవసరం వస్తాది (ప్రకటన 3:15-16). మారుమనస్సు నొంద నిరాకరించువారు తమపై దేవుని ఉగ్రతను తామే సమకూర్చుకొందురు (రోమా 2:5).

మారు మనస్సులో ఒకని చిత్తం మారతాది; తత్ఫలితంగా ప్రవర్తన మారతాది (మత్త 21:28-31). దుర్మార్గతనుండి తొలగి

పోవుట మారుమనస్సు (యోనా 3:10). గనుక మారుమనస్సు పొందాల్సిన అవసరం నీకుంటే, ఈరోజే మారుమనస్సు పొంది దేవుని దూతల మధ్య ఆనందాన్ని కలుగ జేయువా! ఇదిగో ఇప్పుడే అనుకూల సమయం, ఇదే రక్షణ దినము.

—డాన్ డీఫెన్బో

---

## విధేయత అవసరం

### *( Obedience Necessary )*

1 దిన వృత్తాంతములు 13:9-11 లో మన మంతగా ఎరుగని వ్యక్తి ఒక డున్నాడు. అతడు మనకొక విలువైన పాఠాన్ని నేర్పుచున్నాడు. యెహోవా మందసము తమ యొద్దకు తిరిగి వచ్చుచున్నందున ఇశ్రాయేలీయులు ఆనందముతో దానిని ఒక క్రొత్త బండిమీద ఎక్కించి తీసికొని వచ్చుచుండిరి. అయితే ఎద్లకు కాలు జారినందున మందసము కదలకుండా పట్టుకొనవలెనని ఉజ్జా చేయి చాపాడు. అతడు దాన్ని పట్టుకొనగా యెహోవా కోపము రగులుకొనెను. ఆయన అతని మొత్తెను గనుక అక్కడనే అతడు చనిపోయెను.

ఉజ్జాకు దేవుడిచ్చిన శిక్ష చాల తీవ్రమైనదని అనేకులు తలస్తారు. ఉజ్జా యొక్క ఉద్దేశము మంచిదై యున్నట్లే కనబడుచున్నది. మనము ఇక్కడ గమనించవలసిన సంగతి యేమంటే దేవుని మందసమును మానవులు తాకరాదని దేవుని ధర్మశాస్త్రము ఖండితంగా ఆజ్ఞాపించింది. మందసమునకు మోత కర్రలను దూర్చి దానిని తమ భుజములపై ఎత్తుకొని మోసికొని వెళ్లాలని వారికి చెప్పబడింది. అప్పుడది పడిపోయే ప్రమాదం లేదు. అయితే ప్రజలు తమ యిష్టప్రకారం చేయనెంచుకొన్నారు. ఒక అవిధేయత ఇంకొకదానికి నడిపించింది.

ఈ కథనుండి మనం నేర్చుకోవలసిన పాఠం యేమంటే, దేవుడు తన ఆజ్ఞలకు ఎప్పుడూ ఖచ్చితమైన విధేయతనే కోరాడు. "ఎందు

కనగా దేవదూతలద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచ బడినందున, ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొంది యుండగా, ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై...వినిన వారిచేత మనకు దృఢపరచబడెను" అని హెబ్రీ 2:2-4 లో వ్రాయబడి యున్నది. దేవుని వాక్యము విపులముగానే యున్నది. దేవదూతలద్వారా పలుకబడిన పాత ధర్మశాస్త్రమునకు ఖచ్చితమైన విధేయతను దేవుడు కోరియుంటే, ఆయన కుమారుని ద్వారా పలుకబడిన క్రొత్త ధర్మశాస్త్రమునకు మరింకెంత విధేయ తను కోరుతాడు? దేవుడనుగ్రహించుచున్న గొప్ప రక్షణను నిర్ల క్ష్యము చేయకుండా జాగ్రత్తగ యుందము. —రాన్ స్టో.

# క్రొత్త నిబంధనలో నీటి బాప్తిస్మము

## *(Water Baptism in the New Testament)*

## ఎవరు?

బాప్తిస్మము పొందడానికి అర్హులెవరు? ఎవరు బాప్తిస్మము పొందవచ్చును?

1. ఎవరైతే మొదట బోధింపబడతారో వారు. మత్తయి 28:19.
2. సువార్త బోధింపబడిన వారు. మార్కు 16:15.
3. సువార్త విశ్వసించినవారు. క్రీస్తు యొక్క మరణ సమాధి పున రుత్థానముల వాస్తవములను నమ్మినవారు. మార్కు 16:15, 16; 1 కొరింథీ 15:1-4.
4. సువార్త వాక్యము సంగీకరించిన వారు. అపొ.కా. 2:41
5. మారు మనస్సు పొందిన వారు. అపొ.కా. 2:38.
6. క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనిన వారు. అపొ.కా. 8:36-38; రోమా 10:10; 1 తిమో 6:12, 13.

## ఎందుకు ?

బాప్తిస్మముయొక్క ప్రయోజనం యేమిటి? బాప్తిస్మము సాధించేదేమిటి? బాప్తిస్మముయొక్క ఫలితం యేమిటి? మానవు డెందునిమిత్తం బాప్తిస్మము పొందాలి?

1. రక్షింపబడుటకు. మార్కు 16:16; 1 పేతురు 3:21
2. పాపక్షమాపణ పొందుటకు. అపొ.కా. 2:38
3. పాపములు కడిగివేసుకొనుటకు. అపొ.కా. 22:16
4. క్రీస్తు మరణములో ప్రవేశించుటకు. రోమా 6:3
5. క్రీస్తుతో సమాధి చేయబడుటకు. రోమా 6:4
6. క్రీస్తులో ప్రవేశించుటకు, క్రీస్తును ధరించుటకు. గలతీ 3:27
7. 'ఒకే శరీరములో' ప్రవేశించుటకు. 1 కొరింథీ 12:13
8. పరిశుద్ధాత్మ వరమును పొందుటకు. అపొ.కా. 2:38

## ఏమిటి ?

బాప్తిస్మపు క్రియ యేమిటి? అదెలాగుంటాది? బాప్తిస్మము ఎలా పొందాలి?

1. నీటిలోనికి వెళ్ళి, నీటిలోనుండి వెలలి వచ్చుటద్వారా. మార్కు 1:9, 10
2. విస్తారమైన నీళ్ళున్నచోట. యోహాను 3:23
3. బాప్తిస్మమిచ్చువాడు, పొందువాడు నీటిలోనికి వెళ్ళి, నీటిలో నుండి వెలలి వచ్చుటద్వారా. అపొ.కా. 8:38, 39.
4. నీటిలో సమాధి చేయబడుటద్వారా. రోమా 6:4.
5. నీటిలో పాతిపెట్టబడుటద్వారా. రోమా 6:5.
6. తిరిగి లేపబడుటద్వారా. రోమా 6:4.
7. శరీరములు కడుగబడుటద్వారా. హెబ్రీ 10:22.

## ఎప్పుడు ?

ఒకడు ఎప్పుడు బాప్తిస్మము పొందాలి? విశ్వసించి, మారు మనస్సు పొందిన తరువాత బాప్తిస్మము కొరకు ఎంతకాలం కనిపెట్టాలి?

1. రేపటిని గూర్చి ఏమీ వాగ్దానం చేయబడలేదు. ఈరోజులో మిగిలిన సమయంకూడా వాగ్దానం చేయబడలేదు. యాకోబు 4 : 13, 14.
2. ఆలస్యం చేస్తే పాపమే సమకూడుతుంది. యాకోబు 4:17.
3. ఈ రోజే, ఇప్పుడే రక్షణదినము. 2 కొరింథీ 6:2.
4. వాక్యాన్ని అంగీకరించిన రోజే. అపొ. కా. 2:41.
5. ప్రభువుని నమ్మి ఆయన వాక్యము నంగీకరించిన ఘడియలోనే. అపొ. కా. 16:32, 33.

## గత పాపములను గూర్చి క్షమించ బడాలంటే నేనేమి చేయాలి ?

1. దేవుని వాక్యాన్ని వినాలి. రోమా 10:17.
2. దేవుని యొద్దకు రాగలిగే విశ్వాసం కలిగియుండు. హెబ్రీ 11:6; మార్కు 16:15, 16.
3. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందు. అపొ. కా. 2:38; 17:30; లూకా 13:3.
4. నీ విశ్వాసాన్ని బహిరంగముగా ఒప్పుకో. రోమా 10:10; 1 తిమో 6:12, 13.
5. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు. మార్కు 16:16; అపొ. కా. 2:38.

—డేవిడ్ అండర్‌వుడ్.

# శిశుబాప్తిస్మము బలవంతముగా యిచ్చే బాప్తిస్మము

## *( Infant Baptism is Baptism by Force ! )*

ఈ దిగువ సంఘటన 1800 సంవత్సరముల కాలములో జీవించిన సత్యసువార్త బోధకుడగు జాన్‌స్మిత్ జీవితంనుండి సంగ్రహించ బడినది.

అమెరికాలో కెంటకీ రాష్ట్రంలో, స్లేట్ క్రీక్ అనే వూరిలో జాన్‌స్మిత్ సువార్త కూటమును జరుపుచుండగా, మెథడిస్టు వారు కూడా ఒక కూటాన్ని జరుపుచుండిరి. ఒకరోజు ఒకామె ఆ మెథడిస్టు బోధకునిచే 'బాప్తిస్మము' యిప్పించే నిమిత్తం తన చంటిబిడ్డను తీసి కొనివచ్చింది. ఆ చంటిబిడ్డ యేడ్చుచు కొట్టుకొనుచూ యుండగా, వారి ఆచారప్రకారము ఆ బోధకుడు ఆ బిడ్డపై నీళ్లు జల్లి ఆ క్రియను జరిగించాడు.

ఆ మరుచటిరోజు జాన్‌స్మిత్ ఒక కాలువలో కొందరికి బాప్తిస్మ మిచ్చుచుండగా, ఆ మెథడిస్టు బోధకుడుకూడా జనంలో యుండి జరుగుచున్న దాన్ని చూస్తున్నట్లు గమనించాడు. వెంటనే అతడా మెథడిస్టు బోధకుని చేయి పట్టుకొని నీళ్ళదగ్గరకు లాగుకొని వెళ్లాడు.

"స్మిత్ గారు నీవేమి చేయబోతున్నావ్ ?" అని అతడడిగాడు. ఆప్రశ్నకు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ, "నేనేమి చేయబోతున్నానా ! అయ్యా, నేను నీకు బాప్తిస్మ మియ్యబోవుచున్నాను!" అన్నాడు స్మిత్.

"కాని నేను బాప్తిస్మం పొందగోరడంలేదు" అన్నాడా మనుష్యుడు, ఇదేదో కానిసమయంలో జరిగే జోక్‌లా నవ్వుతూ.

"నీవు విశ్వసించుటలేదా ?" అన్నాడు జాన్‌స్మిత్. "తప్పకుండా, నేను విశ్వసిస్తున్నాను" అని జవాబిచ్చాడు ఆ మెథడిస్టు బోధకుడు.

"అట్లయితే, అయ్యా, రండి" అని స్మిత్ చెబుతు అతన్ని నీళ్ళ దగ్గరకు లాగాడు; "నమ్మినవారు బాప్తిస్మం పొందాలి."

నిజంగా ఇది పరిహాసానికి చేసింది కాదని గ్రహిస్తూ ఆ మెథడిస్టు బోధకుడు, "కాని...నీళ్ళలోనికి వెళ్ళడానికి నా కిష్టంలేదు. నా కిష్టంలేకుండా బాప్తిస్మం పొందితే దానివలన నాకు యేమీ ప్రయోజనం ఉండదని" చెప్పాడు.

జాన్‌స్మిత్ అందరు తన మాటలను వినేలాగున బిగ్గరగా చెప్ప సాగాడు. ఒడ్డున ఉన్నవారు పాటలు పాడుట మానివేసారు. అతడు చెప్పేది వినడానికి అందరు ఆసక్తిగా యున్నారు. అతడిట్లన్నాడు: "నిస్సహాయ స్థితిలో యున్న ఒక చంటిబిడ్డ నీవు పట్టుకొనగానే గిజగిజలాడుచు, నీ బాప్తిస్మానికి వ్యతిరేకంగా కొట్టుకొనుచున్నాసరే నిన్న నీవు బాప్తిస్మ మియ్యలేదా? అయ్యా, ఆ బిడ్డయొక్క ఆమోదాన్ని ముందు తీసికొన్నావా? నాతో రమ్ము, నీకు ఇప్పుడు తప్పక బాప్తిస్మ మియ్యాలి!" ఇంకో ఘడియలో వారిద్దరూ నీటి అంచునకు వచ్చేసారు.

అయితే ఆ మెథడిస్టు బోధకుడు బిగ్గరగా అరుస్తూ మనస్ఫూర్తిగా తన అసమ్మతిని తెలియజేయ సాగాడు. జాన్‌స్మిత్ ఆ మనుష్యుని చేయి విడిచిపెట్టాడు. అందరికీ ఒక పాఠం ఇక్కడ బోధింపబడింది. శిశు బాప్తిస్మంలో యున్న విలువను గూర్చి ఆలోచిస్తూ ప్రతివారు తమ యిండ్లకు వెళ్ళారు.

మారుమనస్సు పొందిన విశ్వాసులు బాప్తిస్మం పొందాలని బైబిలు బోధించుచున్నది (అపో.కా. 2:38; మార్కు 16:16). పసిబిడ్డ విశ్వసించలేదు, మారుమనస్సు పొందలేదు.

("Life of Elder John Smith" taken from The Four State Gospel News, June 1984).

# దేవుని మహిమపరచుట

"యెహోవాను నేనే; ఇదే నా నామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చువాడను కాను, నాకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనియ్యను (యెషయా 42:8).

"నేను మనుష్యుల వలన మహిమ పొందువాడను కాను" (యోహాను 5:41).

అందుకు యూదులు -

"మన తండ్రియైన అబ్రాహాము చనిపోయెను గదా! నీ వతని కంటె గొప్పవాడవా అని ఆయనను అడిగిరి".

అందుకు యేసు - నన్ను నేనే మహిమపరచుకొనిన యెడల నా మహిమ వట్టిది; మా దేవుడని మీ రెవరినిగూర్చి చెప్పుదురో ఆ నా తండ్రియే నన్ను మహిమ పరచుచున్నాడు" (యోహాను 8 : 52-54).

"సత్యస్వరూపియైన పరిశుద్ధాత్మ ద్వారా నేను మహిమపరచబడుదునని" క్రీస్తు తన శిష్యులకు చెప్పారు (యోహాను 16:13-14).

"అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు అను వారి దేవుడు అనగా మన పితరుల దేవుడు తన సేవకుడైన యేసును మహిమపరచియున్నాడు".

"మీరు జీవాధిపతిని చంపితిరి. గాని దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను. అందుకు మేము సాక్షులము" (అపొ. కార్యములు 3 : 13-15).

"అడుగువాటన్నిటి కంటెను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయు శక్తిగల దేవునికి క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదా కాలము మహిమ కలుగునుగాక. ఆమెన్ (ఎఫెసి 3:21).

ప్రియ చదువరి - మనుష్యులలోను, దేవతలయందును, విగ్రహములలోను, మానవకల్పిత సంఘాలలోను దేవుని మహిమ ఉన్నదని ఎంతోమంది భ్రమతో తేరి చూచుచున్నారు. మానవకల్పిత సంఘాల వలన మోసపోవద్దు. నీ వెవరి సంఘ సభ్యుడవో లేఖనమువలన పరిశోధించి దేవుడు మహిమపరచబడుచున్న సంఘములో నేడే ఉండుటకు సిద్ధపడుము.

క్రీస్తు అను బండపై నిర్మించబడిన సంఘములో సభ్యుడవగుటకు ఉపదేశక్రమమును అనుసరించి బాప్తిస్మముద్వారా క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములలో ఐక్యత పొంది రక్షింపబడుము. క్రీస్తు సంఘముతో ఆయనచే చేర్చబడుము.

— R. సమూయేలు, అమలాపురం.

---

# క్రీస్తు ప్రభుని రెండవ రాకడ

యేసుప్రభు రెండవసారి ఈ లోకమునకు వచ్చునని క్రైస్తవ ప్రపంచ మంతయు నమ్మను (చున్నారు) మరియు ఆయన రాకడను గూర్చి అనేక తప్పుబోధలు కూడ బయలుదేరినవి. ఆయన రాకను గూర్చిన సత్యమేది? అందు దూరపరచవలసిన తప్పుడు బోధలేవి? ఆయన రాకను కనిపెట్టు మనము దానికొరకెలాగు సిద్ధపడవలయును? ఇవి క్లుప్తముగా చూచెదము.

## అయవ రాక విశ్చయము :

ఏలయన ఆయన స్పష్టముగ పలికెను (యోహాను 14:3). దేవదూతలు తెలియజేసిరి (అ. కా. 1:11). అపొస్తలులు తమ పత్రికలలో వ్రాసిరి (హెబ్రీ 9:28; 1 థెస్స 4, 5 అధ్యా; 2 థెస్స 1:7-10; 2 పేతు 3:10).

అప్పటికి సజీవులైన వారెల్లరు ఆయనను స్పష్టముగ జూతురు (ప్రక 1:7). ఆయన శరీరముతో ఆరోహణమైనాడు; శరీరముతో తిరిగి వచ్చును (అపొ. కార్య 1:11). ఆయన ఒంటరిగ రాడు (1 థెస్స 4:16). తనవారిని తాను సిద్ధపరచిన నివాసములకు కొనిపోవుటకును (యోహా 14 : 3), అవిశ్వాసులను నాశనమునకు అప్పగించుటకును వచ్చును (2 థెస్స 1:6-8).

## ఆయన రాకడకు గురుతు లేవి ?

మత్త 24; మార్కు 13; లూకా 21 అధ్యాయములలో చెప్పబడిన కరవులు, యుద్ధములు, భూకంపములు ఆయన రాకకు గురుతులని చాలమంది పొరబాటుగ నమ్ముచున్నారు. మత్త 24 : 3 లో శిష్యులు రెండు ప్రశ్నల నడిగిరి. 1. దేవాలయ నాశన మెప్పుడు? 2. నీ రాకడ ఎప్పుడు? వీనికి గురుతు లేవి? ఈ రెండు ప్రశ్నలకు 24:1-35 వరకు యెరూషలేము నాశనమును గూర్చియు 36-51 వరకు ఆయన రెండవ రాకను గూర్చియు జవాబు చెప్పుచున్నాడు.

మొదటి ప్రశ్న : యెరూషలేము నాశనమునకు ముందు గురుతులు గలవని చెప్పినాడు. అక్షరాల ఆ గురుతుల ప్రకారము జరిగినది. ప్రభువు పలికిన (సుమారు 37 సం॥లకు) అనగా క్రీ॥శ॥ 70 లో రోమా పటాలములు, యెరూషలేమును సమూల నాశనము చేసినవి. యేసు ప్రభు విది చెప్పు కాలమందు జీవించియున్న వారు చాలమంది యెరూషలేము నాశనమును చూచిరి. ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని యేసుప్రభువు చెప్పినమాట నెరవేరినది (34 వ). కనుక పై చెప్పబడిన గురుతులు యెరూషలేము నాశనమును గూర్చియే గాని, మరి దేనికిని చెందవు.

రెండవ ప్రశ్న : ఆయన రాకను గూర్చి - 36 వచనము - "అయితే" అని ప్రారంభించినాడు - అనగా ముందు జరిగిన దానికి గురుతులు గలవు. అయితే - ఆయన రాకకు గురుతులు లేవు. అది

అకస్మాత్తుగ జరుగును - ఆ దినమునుగూర్చి దూతలుగాని, ఏ మాన వుడుగాని, చివరకు యేసుప్రభువుగాని ఎరుగరు అని స్పష్టముగ పలికి నాడు. ఎవరును ఎరుగరు అకస్మాత్తుగ కలుగును, దొంగవలె వచ్చును, ఎల్ల వేళల మెలకవుగా నుండుడి అను మాటలు, ఆ దినమునకు గురు తులు లేవని స్పష్టముగ తెలియజేయుచున్నవి. మరియు 37-51 వరకు చూడుము.

## వేయేండ్ల పరిపాలన అనునది గలదా ?

క్రీస్తు రెండవసారి వచ్చునపుడు యెరూషలేములో రాజ్య స్థాపనచేసి వేయేండ్లు పరిపాలన చేయునను మరియొక తప్పుడు బోధ చాల వ్యాప్తి చెందియున్నది.

ఈ బోధలో యిమిడియున్న విశేషము లేవన—

1. ఆయన రాక సమయమున నీతిమంతులు మాత్రము పునరుత్థానము చెందుదురు - వారు ఎత్తబడుదురు.
2. యేసుప్రభు యెరూషలేమును కేంద్రముగ జేసికొని వేయేండ్లు పరిపాలన సాగించును.
3. వేయేండ్లు అనంతరమున అనీతిమంతులు లేతురు. ఇది రెండవ పునరుత్థానము.
4. సాతానును, క్రీస్తుప్రభువును తమతమ అనుచరులతో కలిసి ఒకరిపై ఒకరు యుద్ధము చేయుదురు. ఆ యుద్ధములో సాతాను ఓడిపోవును. తరువాత అంత్యతీర్పు.

ఇందలి అసందర్భములను చూతము :-

1. పునరుత్థాన మొక్కటే, రెండుకాదు - యోహా 5 : 28.
2. నా రాజ్యము యిహసంబంధమైనదికాదు (యోహా 18:36-38) అని ప్రభువు స్పష్టముగా పలికిన పిమ్మట ఇహలోక రాజ్యస్థాపనకై క్రిందికి దిగజారడు. ఆయన పెంతెకొస్తునాడే రాజ్యస్థాపన చేసినాడు. క్రైస్తవులైనవారు ఆ రాజ్యములో నున్నారు (కొల 1:13).

3. ఇహలోకరీతిని అంత్యయుద్ధము జరుగదు. మన యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావు (2 కొరి. 10:4; ఎఫె 6:13-17).
4. క్రీస్తు భూమిపై రాజ్యమేలు ననుటకు భూమి అనేది ఉండనే ఉండదు. అది సంపూర్ణ నాశన మగును (2 పేతురు 3:10).

## ఆయన రాకకై ఎట్లు సిద్ధపడవలయును ?

1. మలినవస్త్రములను ఉదుకుకొనుడి - అనగా నమ్మి బాప్తిస్మము పొందుడి - ప్రక 22:12-14.
2. పరిశుద్ధ ప్రవర్తన కలిగియుండుడి-2 పేతు 3:12.
3. సువార్తను ప్రకటించుడి, ఏలయన ఆయన వచ్చినపిమ్మట రక్షణ పొందుటకు మరొక తరుణము లేదు - 2 తిమో 4:1, 2.

—T. జ్ఞానానందము, కాకినాడ-2.

---

## మంటిఘటములలో ఐశ్వర్యము

### (*Treasure in Earthen Vessels*)

అపో. పౌలు ఇట్లు వ్రాసాడు. "అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీ 4:7). క్రీస్తు సువార్తే ఈ ఐశ్వర్యము. క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములు సువార్తయొక్క ముఖ్య వాస్తవాలు. తాను బోధించిన సువార్తనుగూర్చి పౌలు ఇట్లు చెప్పాడు: "నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనములప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను. లేఖనములప్రకారము మూడవ దినమున లేపబడెను (1 కొరింథీ 15:3).

ఈ ఐశ్వర్యము (క్రీస్తు సువార్త) క్రైస్తవుల చేతులలో ఉంచబడింది. యేసు ఇట్లు చెప్పాడు: "మీరు సర్వలోకమునకు వెళ్లి

ర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు
క్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15,
6). సువార్తను విని విశ్వసించకుండా విధేయత చూపకుండా మాన
ుడు రక్షింపబడ నేరడు.

"కాబట్టి ఈ పరిచర్య పొందినందున కరుణింపబడినవారమై
అధైర్యపడము" అని పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీ 4:1).
పౌలు కున్నట్టి ధృడమైన కృతజ్ఞత మనము కలిగియుండాలి. సువార్త
ప్రకటించడానికి ముందుకు వెళ్లుటకది అతనికి బలాన్ని చేకూర్చింది.
"అయితే కుయుక్తిగా నడుచుకొనకయు, దేవుని వాక్యమును వంచనగా
బోధింపకయు, సత్యమును ప్రత్యక్షపరుచుటవలన ప్రతి మనుష్యుని
మనస్సాక్షి యెదుట మమ్మును మేమే దేవుని సముఖమందు మెప్పించు
కొనుచు, అవమానకరమైన రహస్యకార్యములను విసర్జించి
యున్నాము" (2 కొరింథీ 4:2).

నశించినవారికి సువార్త మరుగై యున్నది. గ్రాహ్యముకా
నందువలన అది మరుగై యుండలేదు. "దేవుని స్వరూపియైయున్న
క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింప
కుండు నిమిత్తము ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి
మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (2 కొరి 4:4). మాన
వుడు నశించిన స్థితిని తాను చూచునట్లు క్రైస్తవుడు పనిచేయాలి.

మనము పౌలును అనుకరించి, మనలనుగూర్చి గాక క్రీస్తును
గూర్చి ప్రకటించాలి (2 కొరింథీ 4:5) క్రీస్తు సువార్త సూత్రములను
మనం అనుకరిస్తూ ఆయన వెలుగును ఇతరులకు ప్రకాశించెదముగాక!
ఆయన సువార్తను మన పెదవులతో ప్రకటించెదముగాక!

—W. ఎడ్విన్ కియర్లీ.

# మీకొక మాట!

బైబిలును గూర్చి చులకనగా మాట్లాడవద్దు. ఈ పురాతన గ్రంథాన్ని పాడుచేయడానికి యేమీ ప్రయత్నించవద్దు. బైబిలు నీ కిష్టం కాకపోతే దానికంటే మిన్నయైన గ్రంథాన్ని వ్రాయడానికి ప్రయత్నించు. నీలాంటి వారినుండి, నీ బంధువులనుండి, మిత్రులనుండి సహాయం పొందు. ఈ ప్రపంచ మూలమూలనుండీ సలహాలను తీసికో. బైబిలుకంటె శ్రేష్టమైన గ్రంథాన్ని వ్రాయడానికి వారంతా నీకు సహాయం చేయాలని అభ్యర్థించు. ఆ గ్రంథం సంపూర్తి అయిన తరువాత వార్తాపత్రికలు, రేడియో, టెలివిజనులద్వారా ప్రపంచానికి చాటించు. బైబిలును మించి ప్రకాశించగల గ్రంథాన్ని వ్రాయగలిగేటంత వరకు, బైబిలుకు వ్యతిరేకంగా మాత్రం నీవేమీ పలుకవద్దు! ఇదే మా కోరిక. నిలబెట్టే వాడు గాక తప్పుల నెన్నే మానవుడు బలహీనుడు. మానవులు లక్ష్యపెట్టుటకు అతడు తగడు.

---

Regd. No. H/KD—45/KD.H.O

*From*

SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................